సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 25 । జూలై । 2023



రైతులు అధైర్యపడొద్దు

8లో▸

రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యేలు జోగు రామన్న, బాపూరావ్ అన్నారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను వారు పరిశీలించారు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా సోలమన్



ఆదిలాబాద్: ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా పి.సోలమన్ సోమవారం ఆదిలాబాద్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకు హైదరాబాద్‌లో చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా విధులు నిర్వహించగా, ఆదిలాబాద్ ఆర్‌ఎంగా బదిలీ చేస్తూ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఇక్కడ ఆర్‌ఎంగా పనిచేసిన జానీరెడ్డి నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ

ఇంద్రవెల్లి: ముత్నూర్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023 అవార్డులో భాగంగా గ్రామాన్ని సోమవారం సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. అనంతరం తడి, పొడి చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇంటింటికి వెళ్లి మహిళలకు తడి, పొడి చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీసీఈవో గణపతి, డీఆర్డీవో కిషన్, ఎంపీడీవో పుష్పలత, ఏపీఎం రామారావ్, తదితరులున్నారు.

ఖైదీల భద్రత ముఖ్యం

- ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల భద్రత ముఖ్యమని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా జైలులో సోమవారం సెక్యూరిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. మహిళ, పురుష ఖైదీలకు వేర్వేరుగా ఉన్న సెల్లను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కిచెన్‌ను సందర్శించి పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. ఖైదీలను కోర్టు, ఆస్పత్రికి తీసుకెళ్లే సమయంలో తీసుకోవాల్సిన భద్రత, జాగ్రత్తలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం హోంగార్డుల పనితీరును పరిశీలించారు. సమావేశంలో జైలు సూపరింటెండెంట్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు కొత్త అదనపు కలెక్టర్లు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న రెవెన్యూ అడిషనల్ కలెక్టర్లు బదిలీ అయ్యారు. నాలుగు జిల్లాలకు కొత్త అధికారులు రానున్నారు. స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న నలుగురిని అడిషనల్ కలెక్టర్లు(రెవెన్యూ)గా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) ఎన్.నటరాజ్‌ను ఖమ్మం జిల్లాకు అదే హోదాలో బదిలీ చేశారు. ఆయన స్థానంలో పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న బేతి రాజేశంను నియమించారు. మంచిర్యాల అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా పోస్టింగ్ కోసం వేచి చూస్తున్న ఎస్.మోతిలాల్‌ను నియమించారు. భద్రాచలం జిల్లా స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ కిశోర్‌కుమార్‌ను నిర్మల్ అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా నియమించారు. మహబూబ్‌నగర్ జిల్లా ఇరిగేషన్ శాఖలో ఎస్డీసీగా పనిచేస్తున్న డి.వేణును కుమురంభీం జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కనీస సామర్థ్యాలు పెంపొందేలా కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ప్రణీత అన్నారు. పట్టణంలోని వివేకానంద బీఎడ్ కళాశాలలో ఎఫ్‌ఎల్‌ఎస్ రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. గతేడాది నిర్వహించిన తొలిమెట్టు ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందాయని, రెండోవిడత ద్వారా మరింతగా పెంపొందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ కంటి నర్సయ్య, ఆర్పీలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

తలమడుగు: విద్యార్థులకు న్యాణమైన విద్యనందించాలని డీఈవో ప్రణీత అన్నారు. మండలంలోని సుంకిడి జెడ్పీ పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు.

నేడు 'ఇన్‌స్పైర్'పై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: ఇన్‌స్పైర్ నామినేషన్లపై మంగళవారం ఉదయం 10.45 గంటలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు జూమ్ ద్వారా ఓరియంటేషన్ నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి నామినేషన్ల దరఖాస్తుకు ఈనెల 31 వరకు గడువుందని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల నుంచి ఐదు నామినేషన్లు పంపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్‌అధికారి రఘురమణను 94400 60288లో సంప్రదించాలని పేర్కొన్నారు.

“ భీంపూర్ మండలంలోని గుబిడివానులు గ్రామం నుంచి బయటకు వెళ్లాలంటే ఈ కరంజి వాగు దాటాల్సిందే. మొన్నటి భారీ వర్షాలు, పెన్‌గంగ ఉధృతి కారణంగా బ్యాక్ వాటర్ ముంచెత్తడంతో ఈ వాగు ఉవ్వెత్తున ప్రవహించింది. దీంతో గ్రామస్తులు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకపోయారు. వారికి ఊరు నుంచి బయటకు వెళ్లాలంటే మరో మార్గం లేదు. ఆదివారం నుంచి వర్షం తగ్గడం, వరద ఉధృతి క్రమేపీ తగ్గుతూ రావడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. వాగు సాధారణ స్థితిలోకి రావడంతో మునపటి లాగే రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ నిర్మిస్తున్న నూతన వంతెన పనులు పూర్తి కాకపోవడంతో వరదలు వచ్చినప్పుడల్లా ఇదే దుస్థితి. ఇదొక్కటే కాదు.. బ్యాక్ వాటర్ కారణంగా తీర ప్రాంతంలోని అనేక గ్రామాలది ఇదే పరిస్థితి.



తేరుకుంటున్నాయి

- వరద ముంపు నుంచి బయటపడుతున్న గ్రామాలు
- పెన్‌గంగ బ్యాక్ వాటర్ ప్రభావంతో అతలాకుతలం
- ప్రస్తుతానికి తగ్గిన వరద ఉధృతి

సాక్షి,ఆదిలాబాద్: పెన్‌గంగ పరీవాహక గ్రామాలు భారీ వర్షాలు కురిసినప్పుడల్లా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడం పరిపాటిగా మారింది. బ్యాక్ వాటర్ ముంచెత్తినప్పుడు గ్రామం నుంచి కాలు బయటకు పెట్టలేని పరిస్థితిలో బిక్కు బిక్కుమంటూ గడపాల్సిందే. అత్యవసర పరిస్థితుల్లో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. జైనథ్ మండలంలో 15 గ్రామాలు, బేల మండలంలో ఎనిమిది, భీంపూర్ మండలంలో ఏడు గ్రామాలు తీర ప్రాంతంలో ఉంటాయి. వీటితో పాటు ఆయా గ్రామాలకు ఆనుకొని ఉండే పల్లెలు కూడా వరద ప్రవాహానికి గురవుతాయి. ఈ 30 తీర ప్రాంత గ్రామాలతో పాటు వాటిని ఆనుకొని ఉండే అనేక పల్లెలు కూడా వరద ప్రవాహానికి గురవడం పరిపాటిగా మారింది. భారీ వర్షాలు కురిసినప్పుడు ఆయా వాగుల నీళ్లన్నీ చివరగా పెన్‌గంగలో కలవాలి. అయితే ఎగువ నుంచి భారీ వరద ఉధృతి కారణంగా ఈ వాగుల ప్రవాహాన్ని పెన్‌గంగలో కలవనివ్వని పరిస్థితి ఉంటుంది. దీంతో ఆ వరద వెనక్కి వచ్చి గ్రామాలను ముంచెత్తుతుంది. ఈ క్రమంలో పెన్‌గంగ ఉప్పొంగిందంటేనే ఆయా గ్రామాల్లో దడ మొదలవుతుంది. ఈసారి కనీవిని ఎరగని రీతిలో 5లక్షల క్యూసెక్కుల వరద రావడం హైరానాకు గురిచేస్తుంది. ప్రస్తుతం వరద ప్రవాహం తగ్గినప్పటికీ మళ్లీ భారీ వర్షాలు కురిసి పైనుంచి కూడా వరద వస్తే తమ పరిస్థితి ఏందన్న ఆందోళన వారిలో కనిపిస్తుంది.

ఇక్కడ నష్టాలు అధికం..

సాధారణంగా భారీ వర్షాలు కురిసినప్పుడు మిగతా ప్రాంతాల్లోని గ్రామాల్లో నష్టాలు ఒక మాదిరి ఉంటే.. ఈ పరివాహక ప్రాంతాల్లో మరో రకంగా ఉంటుంది. మామూలు గ్రామాల్లో పంట చేలల్లో వరద నీరు చేరినప్పటికీ తర్వాత మామూలు స్థితికి వస్తుంది. కానీ ఇక్కడ మట్టి దిబ్బలు, ఇసుక మేటలు పెద్ద ఎత్తున పంటలను కప్పివేస్తాయి. దీంతో పంటలు మామూలు స్థితికి వచ్చే అవకాశాలు తక్కువ. వరద నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో తెగుళ్ల సమస్య తీవ్రంగా ఉంటుంది. దీంతో మళ్లీ రెండోసారి విత్తనాలు వేయాలి. అలాగే ఆయా గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో గల ఇళ్లు పూర్తిగా వరద ముంపునకు గురవుతాయి. నిత్యావసర వస్తువులు, ఇతర సామగ్రి తడిసిపోవడంతో కనీసం తిండి తినే పరిస్థితులు గగనమవుతాయి. కుటుంబాలు రోడ్డున పడతాయి. రోడ్లు, కల్వర్టులు, వంతెనలు, విద్యుత్ స్తంభాలు పూర్తిస్థాయిలో ధ్వంసం కావడంతో ఆయా గ్రామాల్లో మళ్లీ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వానికి సమయం పడుతుంది. దీంతో అప్పటివరకు గ్రామాల కష్టాలు వర్ణనాతీతం.

వీఆర్‌ఏలు రెగ్యులరైజ్



సీఎం కేసీఆర్, కేటీఆర్‌ల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

- సర్వీస్ క్రమబద్ధీకరిస్తూ జీవో జారీ
- విద్యార్హతల ఆధారంగా కనీస వేతనం
- నేడు ఆయా శాఖల్లో సర్దుబాటయ్యే అవకాశం
- సంబరాల్లో వీఆర్‌ఏలు

కైలాస్‌నగర్: వీఆర్‌ఏలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వీరంతా ఇక ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు. రెవెన్యూశాఖలో ఏళ్లుగా పనిచేస్తున్న వీరి సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చాలీచాలని వేతనాలతో సేవలందిస్తున్న వీరిని విద్యార్హతల ప్రకారం వివిధ శాఖల్లో సర్దుబాటు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం, దాని ఆధారంగానే వారికి కనీస వేతనం నిర్ణయించింది. సర్కారు నిర్ణయంపై వీఆర్‌ఏల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో 1,991 మంది..

వీఆర్‌ఏల సర్వీస్ క్రమబద్ధీకరణతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,991 మందికి మేలు చేకూరనుంది. డిగ్రీ ఆపై విద్యార్హతలు ఉన్నా ఇన్నాళ్లు అరకొర వేతనాలతో కింది స్థాయిలో సేవలందిస్తున్న వారికి విద్యార్హతల ప్రకారం ఉద్యోగాలు దక్కనున్నాయి. అత్యధికంగా నిర్మల్ జిల్లాలో 740 మంది రెగ్యులరైజ్ కాగా, మంచిర్యాలలో 542, ఆదిలాబాద్‌లో 392, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 317 మంది ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు.

విద్యార్హతల ప్రకారం పేస్కేల్

వీఆర్‌ఏ వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేసి, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన మరుసటి రోజే రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌ఏల్లో డిగ్రీ, ఆపై విద్యార్హతలు కలిగిన వారిని అవసరమైన ప్రభుత్వశాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తారు. ఇదే అర్హతతో మున్సిపాలిటీలకు కేటాయిస్తే వారిని వార్డు అధికారులుగా నియమిస్తారు. వీరికి రూ.24,280 కనీస వేతనంగా నిర్ణయించారు. అలాగే ఇంటర్మీడియెట్ అర్హత కలిగిన వారిని రికార్డు అసిస్టెంట్లుగా నియమించనున్నారు. వీరికి రూ.22,240 వేతనంగా నిర్ణయించారు. పదో తరగతి వరకు చదువుకున్న వారికి ప్రభుత్వం నిర్ణయించిన శాఖల్లో ఆఫీస్ సబార్డినేట్, హెల్పర్లుగా నియమించనున్నారు. వీరికి రూ.19వేల కనీస వేతనం చెల్లించనున్నారు. ఇప్పటి వరకు రూ.11,700 వేతనం మాత్రమే పొందుతున్న వీఆర్‌ఏలు ఇకపై భారీ వేతనాలు అందుకోవడంతో పాటు ప్రత్యేక అలవెన్సులు, ఉద్యోగ భద్రత పొందనున్నారు. అలాగే విధి నిర్వహణలో మరణించిన వీఆర్‌ఏల వారసులకు కారుణ్య నియామకాల కింద వారి విద్యార్హతల ప్రకారం ఉద్యోగాలు కల్పించనున్నారు.

శాఖల సర్దుబాటుపై ఉత్కంఠ

సర్వీస్ క్రమబద్ధీకరిస్తూ వేతనాలు ఖరారు చేసిన ప్రభుత్వ నిర్ణయాన్ని వీఆర్‌ఏలు స్వాగతిస్తూ సంబరాలు జరుపుకున్నారు. అయితే వారిని ఆయా శాఖలకు ఇంకా సర్దుబాటు చేయకపోవడంతో ఏ శాఖకు కేటాయిస్తారనేదానిపై వారిలో ఉత్కంఠ నెలకొంది. అయితే మిషన్ భగీరథ, సాగునీటి పారుదల శాఖ, మున్సిపల్, పంచాయితీరాజ్ శాఖల్లో సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఇందులో ఎంత మంది ఏ శాఖకు వెళ్లేది ఇంకా ఖరారు కాలేదు. శాఖల వారీగా సర్దుబాటు చేసే ప్రక్రియను మంగళవారం లోగా పూర్తి చేసి జీవో జారీ చేసే అవకాశమున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

వీఆర్‌ఏల సంబరాలు

వీఆర్‌ఏల సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో సోమవారం సంబరాలు నిర్వహించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల చిత్రాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగన్న, నాయకులు గంగన్న, రమేశ్, కోటేష్, ఇస్తారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల వారీగా వీఆర్‌ఏల విద్యార్హతల వివరాలు

జిల్లా	డిగ్రీ, ఆపై	ఇంటర్	పదో తరగతి	తొమ్మిదిలోపు, నిరక్షరాస్యులు
ఆదిలాబాద్	63	63	63	203
మంచిర్యాల	94	79	91	278
కుమురంభీం	52	55	36	174

ఒకే సమస్యపై పదేపదే రాకుండా చూడాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: ప్రజావాణికి వచ్చే అర్జీదారులు ఒకే సమస్యపై పదే పదే రాకుండా వారికి స్పష్టమైన సమాచారం అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దరఖాస్తుదారులు అందించే సమస్య పరిష్కారమవుతుందా, లేదా అనేదానిపై వారికి స్పష్టమైన సమాచారం అందించాలన్నారు. నిబంధనల మేరకు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ఆర్డీవో బి.స్రవంతి, మున్సిపల్ కమిషనర్ శైలజ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'గిరి వికాసం' వేగవంతం చేయాలి

కైలాస్‌నగర్: సీఎం గిరి వికాసం పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో సీఎం గిరి వికాసం, టీఎస్ ఐపాస్, ఆయిల్‌పామ్ సాగు వంటి పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం సీఎం గిరి వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 460 యూనిట్లకు పాలన అనుమతులు మంజూరు చేశామన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమలకు అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేలా ఉద్యానవన శాఖ అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ఆర్డీవో స్రవంతి, ఏపీడీ రాథోడ్ రవీందర్, విద్యుత్ శాఖ డీఈ సుభాష్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ది మోసపూరిత పాలన

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న గంగారెడ్డి

కైలాస్‌నగర్: సీఎం కేసీఆర్ గత తొమ్మిదేళ్లలో పేదలను మోసగిస్తూనే పాలన సాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి ఆరోపించారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేయాలనే డిమాండ్‌తో పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలపై బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు అందజేశారు. అంతకుముందు బీజేపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు పేదలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, ప్రధానకార్యదర్శి వి.ఆదినాథ్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సుహాసినీరెడ్డి, లాలా మున్నా తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యానికి .. 'ఓపెన్'



డెంగీ దోమలకు ఆవాసమైన కొబ్బరి బొండాలను వ్యాపారులు తొలగించడం లేదు. ఇవి వ్యాధుల ప్రబలతకు దారితీస్తాయి. పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాల ఎదుట గల ద్వారాకనగర్‌లో కనిపించిన దృశ్యమిది.



“ పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండుకుని కనిపిస్తున్న ఈ ఓపెన్ ప్లాట్ ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్‌కాలనీలోనిది. ఖాళీగా ఉన్న ఈ స్థలం నిర్వహణను సదరు యజమాని పట్టించుకోకపోవడంతో ఇలా అపరిశుభ్రంగా మారింది.

- బల్దియాలో ఖాళీ ప్లాట్లు అధికం
- చెత్తాచెదారంతో కంపుకొడుతున్న ఖైనం
- నిర్వహణ మరిచిన యజమానులు
- పట్టించుకోని మున్సిపల్ శాఖ
- సీజనల్ వ్యాధులపై సర్వత్రా ఆందోళన

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో ఖాళీగా ఉన్న ఓపెన్ ప్లాట్లు ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్నాయి. వాటిని ఏళ్ల తరబడి ఖాళీగా ఉంచుతున్న యజమానులు, నిర్వహణను పట్టించుకోవడం లేదు. దీంతో పిచ్చిమొక్కలు, చెత్తాదారంతో నిండి అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. వీటిని తొలగించకపోవడంతో దోమల తీవ్రత పెరిగి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతున్నాయి. గతేడాది పట్టణ ప్రగతిలో మున్సిపల్ పరిధిలోని ఓపెన్ ప్లాట్లన్నింటినీ శుభ్రం చేయించిన బల్దియా యంత్రాంగం ఈ సారి అటువైపు కన్నెత్తి చూడటం లేదని తెలుస్తోంది.

వేలాదిగా ఓపెన్ ప్లాట్లు

పట్టణ పరిధిలో 49 వార్డులున్నాయి. ఇందులో ప్రతీవార్డులో వందలాదిగా ఖాళీ ప్లాట్లు దర్శనిస్తున్నాయి. రియల్ వ్యాపారం జోరుగా సాగుతుండటం, పట్టణ పరిధి విస్తరిస్తుండటంతో భవిష్యత్ అవసరాల కోసమని చాలామంది ఉద్యోగులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు ప్లాట్లను కొనుగోలు చేస్తున్నారు. అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి నిర్వహణను పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి, మురుగునీరు నిలిచి అపరిశుభ్రతకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. పరిసరాలు దుర్గంధ భరితంగా మారుతున్నాయి. దోమల తీవ్రతపెరిగి వ్యాధులకు దారితీస్తున్నాయి. ఇలాంటి ఓపెన్ ప్లాట్లు పట్టణ పరిధిలో వేలాదిగా ఉన్నట్లు మున్సిపల్ అధికారులే చెబుతున్నారు. ఇందులో వీఎల్‌టీ (వేకెన్సీ ల్యాండ్ ట్యాక్స్) చెల్లించని ప్లాట్లు సైతం అదే స్థాయిలో ఉంటాయని అభిప్రాయపడుతున్నారు.

వారికి ఆదాయం.. ప్రజలకు ప్రాణసంకటం

పట్టణంలో కొబ్బరిబొండాల విక్రయాలు ప్రజల పాలిట ప్రాణసంకటంగా మారుతున్నాయి. స్థానిక ఎన్టీఆర్‌చౌక్, ప్రభుత్వ డైట్ కళాశాల సమీపంలో విక్రయిస్తున్న వ్యాపారులు వాటి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. ఇవి డెంగీ దోమలకు ఆవాసంగా మారుతాయని వైద్యులు చెబుతున్నా పట్టింపు కరువవుతోంది. వీటిపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పట్టించుకోని బల్దియా అధికారులు

మున్సిపల్ చట్టం ప్రకారం ఓపెన్ ప్లాట్లను శుభ్రం చేయించాల్సిన బాధ్యత యజమానులదే. ప్రజారోగ్యం దృష్ట్యా గతేడాది వర్షాకాలానికి ముందే మే, జూన్ మాసాల్లో నిర్వహించిన పట్టణ ప్రగతిలో మున్సిపల్ అధ్వర్యంలో శుభ్రం చేయించారు. అయితే ఈ ఏడాది అధికారులు ఆ దిశగా దృష్టి సారించలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చాలాచోట్ల వర్షపునీరు ఓపెన్ ప్లాట్లలో నిలిచింది. చెత్తాచెదారంతో పాటు మురుగునీరు తోడవడంతో దోమల బెడద పెరిగి సీజనల్ వ్యాధులకు కారణమవుతుంది. వాటిని శుభ్రం చేయించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

పట్టణంలో..
వార్డులు : 49
జనాభా : 1,80,390
పట్టణ పరిధిలో ఖాళీగా ఉన్న ప్లాట్లు : 30వేలు
వీఎల్‌టీ చెల్లిస్తున్న యజమానులు : 10వేలు

నోటీసులు జారీ చేస్తాం..

ఓపెన్ ప్లాట్ల నిర్వహణను చూడాల్సిన బాధ్యత వాటి యజమానులదే. తమ ప్లాట్ పరిసరాలను అందరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. లేకుంటే నోటీసులు జారీ చేస్తాం. నోటీసులిచ్చినా వారంలోగా స్పందించకుంటే జరిమానాతో పాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– ఏ.శైలజ, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

దివ్యాంగుల కోసం ప్రత్యేక ఓపీ



ఓపీని ప్రారంభిస్తున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఓపీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. సోమవారం ప్రత్యేక ఓపీని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను వైద్యులు పరీక్షించి చికిత్స అందించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ రిమ్స్‌కు నిత్యం వందలాది రోగులు వస్తుంటారని, దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా ఓపీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ఓపీలో రోగుల సంఖ్య పెరిగిందని తెలిపారు. ఆయన వెంట సూపరింటిండెంట్ అశోక్, ఆర్ఎంఓ చందు, వైద్యులు తిప్పేస్వామి, శ్యామ్ తదితరులు ఉన్నారు.

జింక అప్పగింత



అధికారులకు జింక అప్పగిస్తున్న రమేశ్

లోకేశ్వరం: భారీ వర్షాలకు గోదావరి నది వరద పోటెత్తడంతో జింకపిల్ల మండలంలోని పంచగుడిలో ఈదుల చెరువు కిందికి వచ్చింది. సోమవారం జింకను కుక్కలు వెంబడించడంతో పొలం ఒడ్డుకింద పడి ఉంది. ధర్మోర గ్రామానికి చెందిన మెకానిక్ గడ్డాంద రమేశ్ అటుగుండా వెళ్తుండగా జింకను గమనించి పంచగుడికి తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న నిర్మల్ బీట్ అధికారులు అనుపమ, వెన్నెల అక్కడికి చేరుకోగా, జింకను అప్పగించారు. సర్పంచ్ ఎల్లన్న, వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, నాయకులు పోట్‌పల్లి సాయన్న, సతీశ్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ ఉన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

భైంసాటౌన్: పట్టణంలోని పిప్రికాలనీకి చెందిన వాగ్మారే సోని అనే వివాహిత సోమవారం స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు యత్నించింది. దీంతో అక్కడే చేపలు పడుతున్న కుంట ప్రాంతానికి చెందిన షేక్ అఫ్రోజ్, నజీమ్, ముజాహిద్‌లు గమనించి వెంటనే నీటిలో దూకి ఆమెను ఒడ్డుకు చేర్చారు. అంబులెన్స్‌లో భైంసా ఏరియాస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పేర్కొన్నారు. సోని భర్త రవికుమార్ తనను, ఇద్దరు పిల్లలను వదిలి హైదరాబాద్ వెళ్లిపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించి ఉంటుందని బంధువులు భావిస్తున్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం



చెందూర్ సునీల్(ఫైల్)

భైంసా: బాసర గోదావరి నదిలో సోమవారం చెందూర్ సునీల్(43) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గత రెండు రోజుల క్రితం బాసర వంతెనపై బైక్ వదిలి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం మృతదేహం లభించింది. మృతుడికి నిజామాబాద్‌లో సైకిళ్ల దుకాణం ఉంది.

లక్షణమైన మాస్టారు



అవార్డు స్వీకరిస్తున్న అరవింద్ (ఫైల్)

- సులభ పద్ధతిలో విద్యాబోధన
- సాంకేతికతను అందిపుచ్చుకుంటూ..
- విద్యార్థుల కోసమే యూట్యూబ్ ఛానల్
- లక్షకు పైగా సబ్‌స్క్రైబర్స్



వినూత్న బోధన చేస్తున్నా



సాంకేతికతను వినియోగించుకుని విద్యార్థులకు సులభ పద్ధతిలో పాఠాలు బోధిస్తున్నా. వినూత్న బోధనతోపాటు, వీడియోలు చేసి తన యూట్యూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేశా. 8 నెలల్లో లక్షకుపైగా సబ్‌స్క్రైబర్లు, ఒక్కో వీడియోకు 50 లక్షలపైగా వీక్షకులు చూడడం ఆనందంగా ఉంది. దేశ, విదేశాల్లో తన యూట్యూబ్ చానల్‌కు ఫాలోవర్స్ ఉన్నారు.

– మైస అరవింద్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, నిర్మల్



లక్ష దాటిన యూట్యూబ్ చానల్ సబ్‌స్క్రైబర్స్

1.న్యూటన్ గమన నియమ అనువర్తనం
2. టిండాల్ ప్రభావం
3. పదిపరీక్షలను ఎదుర్కోవడం ఎలా

అత్యధిక వీక్షణలు సొంతం చేసుకున్న వీడియోలు

4. ప్రభుత్వ బడుల్లో ధీటైన బోధన
5. గాలి పీడనం ప్రయోగపూర్వక వివరణ
6.కాంతి వక్రీభవనం గురించి..

నిర్మల్‌ఖిల్లా: ఆయనో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు.. విద్యార్థులకు సులభ పద్ధతిలో పాఠాలు బోధించనిదే తనకు సంతృప్తి ఉండదంటారు. అతనే నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన మైస అరవింద్. లక్ష్మణ చాంద మండలం వడ్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నా రు. సాంకేతికతను అందిపుచ్చుకుని డిజిటల్ పా ఠాలు, ప్రొజెక్టర్‌పై బోధనోపకరణాలతో విద్యాబో ధన చేస్తున్నారు. విద్యార్థులు ఆసక్తిగా వింటున్నా రు. ప్రతీ బోధనాంశాలను వీడియో తీస్తున్నారు. వారి కోసం అరవింద్ మైస వ్లాగ్స్ (Aravind mysa vlogs) పేరిట యూట్యూబ్ ఛానల్ ప్రారంభించి అప్‌లోడ్ చేస్తున్నారు. దేశ విదేశాల్లో విద్యార్థులు, వీక్షకులు చూసి లైక్‌లు టిక్ చేసి, కామెంట్లు పెడుతున్నారు.

లక్షకు పైగా సబ్‌స్క్రైబర్స్

పదో తరగతి విద్యార్థులకు సలహాలు సూచనలు, ఉన్నత విద్యాభ్యాసం, భవిష్యత్ మార్గసూచి, కెరీర్ గైడెన్స్, సమాజంలోని వివిధ వృత్తులు వ్యవసాయ, అనుబంధ రంగాలు తదితర అంశాలపై వీడియో తీసి 'అరవింద్ మైస వ్లాగ్స్‌కు అప్‌లోడ్ చేస్తున్నారు. వీటిని కోటికిపైగా వీక్షించారు. ఇతరులకు షేర్ చేస్తూ ఉంటారు. ఇప్పటికే 'లక్ష'కుపై సబ్‌స్క్రైబర్లుగా ఉండడం విశేషం.

వీడియోలకు క్రేజ్

ఇప్పటికే డీఈవో, జిల్లా కలెక్టర్, సబ్జెక్టు నిపుణులతో తన వీడియోలో పరిచయ కార్యక్రమాలు, సందేశాలను ఇవ్వడంతో అరవింద్ వీడియోలకు క్రేజ్ పెరిగింది. ఇతర దేశాల నుంచి వీక్షకులు ఉన్నారు. ఇప్పటికే ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు, సన్మానాలు, ప్రశంసపత్రాలు అందుకున్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



అర్జీలు స్వీకరిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యలు త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల వారీగా పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో కుడ్మ బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- కిరాణ దుకాణం ఏర్పాటుకు ఆర్థికసాయం మంజూరు చేయాలని కెరమెరి మండలం చందుగూడకు చెందిన జె.రవికుమార్ విన్నవించాడు.
- తనకు అటవీ హక్కు పత్రం ఇప్పించాలని బజార్‌హత్నూర్ మండలం మడగూడ గ్రామానికి చెందిన తుర్పబాయి కోరింది.
- బోథ్ మండలం పార్డి గ్రామానికి చెందిన మెస్రం నిరుపమా ల్యాప్‌టాప్ మంజూరు చేయాలని అర్జీ అందించారు.
- నార్నూర్ మండలం గుండాల గ్రామానికి చెందిన రాథోడ్ ఉష ఏఎన్ఎం ఉద్యోగం ఇప్పించాలని విన్నవించింది.
- తనకు స్వయం ఉపాధి కల్పించాలని ఉట్నూర్ మండలం సాకెర గ్రామానికి చెందిన ఆర్.జైస్వాల్ అర్జీ పెట్టుకుంది.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్



స్టాకు నిల్వలపై ఆరా తీస్తున్న దిలీప్‌కుమార్

బేల: విధి నిర్వహణలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. స్టాకు నిల్వలు, వంట గది, నీళ్ల, తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. సమస్యలపై రోడ్డెక్కుతున్న విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీళ్ల సమస్య లేకుండా పైప్‌లైన్ మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని వార్డెన్‌ను ఆదేశించారు. వార్డెన్ అందుబాటులో లేనప్పుడు, సెలవులో ఉన్నప్పుడు ఉపాధ్యాయుడికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని హెచ్‌ఎంకు సూచించారు. విద్యార్థుల వైద్య, ఆరోగ్యం పట్ల రెండు, మూడు రోజుల్లో ఒక్కో ఆశ్రమ పాఠశాలలో ఒక్కో ఏఎన్‌ఎంను నియమిస్తామన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం, రోడ్డెక్కడం పునరావృతమైతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా విద్యార్థులతో దురుసుగా మాట్లాడుతున్న వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు ఆడ శంకర్, పెందూర్ రాందాస్, సిడాం నందకుమార్‌లు డిప్యూటీ డైరెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

రైతులు అధైర్యపడొద్దు



పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్

బేల: భారీ వర్షాల నేపథ్యంలో రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. మండలంలోని సాంగిడి, బెదోడ, కాంఘర్‌పూర్, గూడ, మణియార్‌పూర్, కొగ్దూర్, మాంగ్రుడ్ రెవెన్యూ గ్రామాల శివారులో పెన్‌గంగ బ్యాక్‌వాటర్‌తో నీట మునిగి దెబ్బతిన్న పంటలను సోమవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి, పంటనష్టంపై ఆరా తీశారు. నియోజకవర్గంలో దాదాపు 20 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు రమేశ్, తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో మహేందర్‌కుమార్ ఉన్నారు.

తాంసి: ముంపు రైతులకు పరిహారం అందేలా చూస్తానని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ తెలిపారు. పెన్‌గంగ వరద ప్రవాహానికి అర్లి(టి)లో ముంపునకు గురై దెబ్బతిన్న పంటలు, ఇళ్లను డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి పరిశీలించారు. 3500 ఎకరాల పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. మంత్రి కేటీఆర్ జన్మదినం పురస్కరించుకుని గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. జెడ్పీటీసీ సుధాకర్, సర్పంచ్ రమ లస్మన్న, ఏవో రవీందర్, తహసీల్దార్ మహేంద్రనాథ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అనిల్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు లింబాజీ ఉన్నారు.

టేకు కలప దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

ముధోల్: టేకు కలపను దొంగిలించిన నిందితులను అరెస్టు చేసినట్లు భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ తెలిపారు. ముధోల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఏఎస్పీ వివరాలు వెల్లడించారు. గత నెలలో 26న ముధోల్‌లో రైతు మధుకర్ టేకు చెట్లు పెంచుతున్నాడు. ఈ క్రమంలో కొందరు టేకు చెట్లను దొంగలించారు. దీంతో రైతు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. గత శుక్రవారం రాత్రి మరోసారి టేకు చెట్లను నరికి తీసుకెళ్తున్న ముగ్గురు దొంగలను పట్టుకుని రూ.2లక్షల విలువ గల టేకు దుంగలు, బొలెరో వాహనం స్వాధీనం చేసున్నట్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన షేక్‌గౌస్, ఫిరోజ్‌ఖాన్, షేక్ సాజీద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నలుగురు జావేద్, అఫ్రోజ్, మహబూబ్, బాషిత్‌లు పరారీలో ఉన్నారని తెలిపారు. దొంగలను పట్టుకున్న స్థానిక సీఐతో పాటు ఎస్సై సిబ్బందిని అభినందించారు. సమావేశంలో సీఐ వినోద్‌రెడ్డి, ఎస్సైలు సాయికిరణ్, మోహన్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించకపోతే ఎన్నికలు బహిష్కరిస్తాం

- ఐటీడీఏ పీవోకు కుండి షెకుగూడ గ్రామస్తుల వినతి



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నార్నూర్: గాదిగూడ మండలంలోని కుండి షెకుగూడకు రోడ్డు సౌకర్యం కల్పించకుంటే వచ్చే ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు తేల్చిచెప్పారు. ఉట్నూర్‌లోని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ను ఆమె కార్యాలయంలో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ గిరిజనులు మాట్లాడుతూ గ్రామంతోపాటు కొలాంగూడ, మారోతి గూడ, చిన్నకుండిలకు రోడ్డు మార్గం లేదన్నారు. వర్షాకాలంలో పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. ఆస్పత్రికి వెళ్లాలంటే వాగులు, చిన్న చిన్న కాలువలు దాటాల్సి వస్తోందన్నారు. గ్రామ సమస్యలు పరిష్కరించాలని గతంలో 70 కి.మీ కాలినడకన కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని 9 రోజులు ఆందోళన చేపట్టినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పటేల్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలి

ఆదిలాబాద్‌రూరల్: దేశంలో సామాజిక న్యాయం, స్త్రీవిద్య కోసం అహర్నిశలు కృషి చేసిన మహాత్మా జ్యోతిబాపూలే దంపతులకు కేంద్రం భారతరత్న ప్రకటించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు సమావేశాల్లో పూలే దంపతులకు భారతరత్న ప్రకటించి గౌరవించాలని కోరారు. అదేవిధంగా పార్టీలకతీతంగా కేంద్రం మాట్లాడి తెలంగాణ మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, మాలీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అంబేకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ ప్రధాన్, ఉత్తం పేట్కులే, అనిల్ కోట్రంగే, రామ్‌కిషన్ శేండే పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

నిర్మల్‌రూరల్: భర్త వేధింపులకు తాళలేక వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. రూరల్ ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం.. నర్సాపూర్(జి) మండల కేంద్రానికి మోగిలేజి సంధ్య(35)తో, నిర్మల్ రూరల్ మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన అరవింద్‌కు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. అరవింద్ తాగుడుకు బానిసై ఆరేళ్లుగా జులాయిగా తిరుగుతుండేవాడు. కుటుంబ పోషణ కోసం సంధ్య జిల్లా కేంద్రంలోని ఓ క్లాత్ ఎంపోరియంలో పనిచేసేది. అరవింద్ తాగుడుకు బానిసై డబ్బులు కావాలంటూ సంధ్యను తరచూ వేధించసాగాడు. మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తాగడానికి డబ్బులు ఇవ్వకపోవడంతో ఆమెతో గొడవపడ్డాడు. మనస్తాపంతో సంధ్య సోమవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదుతో భర్త అరవింద్, అత్త లక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు చిన్నారి మృతి



నిత్య మృతదేహం



నిత్య(ఫైల్)

భైంసారూరల్: పాము కాటుకు చిన్నారి మృతి చెందింది. మండలంలోని హంపోలి గ్రామంలో సోమవారం వేకువజాము ఈ ఘటన చోటుచేసుకుంది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాలు.. బాసిండ్ల రజిత-సాయినాథ్ దంపతులకు కూతురు నిత్య(7), రెండేళ్ల వయస్సు గల కుమారుడు ఉన్నారు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి కుటుంబీకులు భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. రాత్రి 2 గంటల ప్రాంతంలో నిత్య కాలికి ఏదో కరిచిందని ఏడ్చింది. వెంటనే తండ్రి ఆమె కాలిని పరిశీలించగా రక్తం రావడాన్ని గమనించాడు. వెంటనే దుప్పటి తీయగా బయటకువచ్చిన పామును చంపేశాడు. నిత్యను భైంసాలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది.

వేర్వేరు కేసుల్లో ముగ్గురి రిమాండ్

భైంసాటౌన్: వేర్వేరు ఘటనలకు సంబంధించి కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ ఎల్. శ్రీను తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. ఈనెల 5న పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన రాచర్ల శ్యాంపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. అతని భార్య రాచర్ల కరుణ, అత్త గైక్వాడ్ ఇంద్రబాయి దాడి చేసినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ఈ మేరకు ఇరువురిని రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే 19న గోపాల్‌నగర్‌కే చెందిన తోట శంకర్‌పై హత్యాయత్నం చేసిన ఘటనలో కాంతం నరేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆస్పత్రిపై దాడి ఘటనలో ఆరునెలల జైలు

భైంసాటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిపై దాడి చేసిన ఘటనలో 17 మందికి ఆరునెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ పీఆర్ఎల్ నిర్మల్ జిల్లా సెషన్స్ జడ్జి ఎ.కర్ణకుమార్ తీర్పు ఇచ్చినట్లు పట్టణ సీఐ ఎల్.శ్రీను ఓ ప్రకటనలో తెలిపారు. 2009లో జరిగిన ఘటనకు సంబంధించి విచారణ అనంతరం నిందితులకు జైలుశిక్ష విధిస్తూ సోమవారం జడ్జి తీర్పు వెలువరించారని సీఐ పేర్కొన్నారు.

గుట్టలెక్కి వైద్యం..



కాలినడకన వెళ్తున్న వైద్యసిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని బావోజీపేట్ గ్రామంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వేతోపాటు గర్భిణుల చికిత్స కోసం నర్సాపూర్ వైద్యసిబ్బంది సోమవారం కాలినడకన గుట్టలు ఎక్కారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బావోజీపేట్‌కు బైక్‌లపై వెళ్లలేని పరిస్థితి. వైద్య సిబ్బంది రాథోడ్ కృష్ణ, రేణుక కాలినడకన వెళ్లి గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చారు. మండలంలో చాలా గ్రామాలకు సరైన రోడ్ల సౌకర్యాలు లేకపోవడంతో సర్కారు వైద్యం అందని పరిస్థితి ఉంది.

ముందస్తు చర్యలతో ఫైలేరియాకు చెక్



మాట్లాడుతున్న తుకారం

నిర్మల్‌చైన్‌గేట్: ముందస్తు చర్యలతో ఫైలేరియాను అరికట్టవచ్చని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ తుకారం అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో 'మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్'పై సోమవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా లక్షణాలు, వ్యాధిబారిన పడితే తలెత్తే అనారోగ్య సమస్యలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మాస్ అడ్మినిస్ట్రేషన్‌లో భాగంగా ఐవర్ మెక్టిన్, ఆల్బెండజోల్ డీఈసీ మాత్రలను తీసుకునేలా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. డీఎంహెచ్‌వో ధనరాజ్ మాట్లాడుతూ మైక్రోఫైలేరియా ఎక్కువ శాతం మందిలో ఉంటుందన్నారు. 10–15 ఏళ్ల వరకు వ్యాధి లక్షణాలు బయటకు కనిపించవని అన్నారు. మాత్రలు ఇప్పుడు తీసుకోక, వ్యాధి బారినపడితే చికిత్స అందుబాటులో లేదన్నారు. బోధకాల వ్యాధి నివారణకు ఆగస్టు 10 నుంచి బూత్ యాక్టివిటీస్, ఇళ్ల సందర్శన, మాప్ అప్ ద్వారా నిర్వహిస్తామన్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ ఎజిల్ హర్సన్, కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ రాజారమేశ్, వైద్యాధికారులు ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య

తలమడుగు: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఏఎస్సై సురేందర్ కథనం ప్రకారం..మండలంలోని కుచులాపూర్‌కు చెందిన గోల్లాల రాములు (36), భార్య సవిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాములు వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం పొలంలో పిచికారీ చేసేందుకు వెళ్లాడు. పిచికారీ తర్వాత మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన



నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ ఉద్యోగులు

కైలాస్‌నగర్: తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ, కనీస వేతనం చెల్లించడంతో పాటు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్నకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఇందులో ఎస్ఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు అనురాధ, దీప్తి, ప్రశాంత్‌రెడ్డి, ప్రకాశ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్లు అందజేసి నిరసన..



తహసీల్దార్‌కు హెల్మెట్ అందిస్తున్న సభ్యులు

బోథ్: తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో పైకప్పు కూలితే సిబ్బంది రక్షణగా ఉండేందుకు బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు సోమవారం హెల్మెట్లు పంపిణీ చేసి వినూత్న నిరసన తెలిపారు. తహసీల్దార్ అతికొద్దిన్‌కు వీటిని అందజేశారు. పైకప్పు కూలితే రక్షణ కోసం హెల్మెట్లు అందజేసినట్లు సభ్యులు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని రూ.5 కోట్లు కేటాయించి నిర్మించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ స్తంభం ఎక్కి యువకుడి హల్‌చల్



విద్యుత్ తీగలు పట్టుకున్న ప్రవీణ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీలో ఓ యువకుడు మద్యం మత్తులో విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్న ప్రవీణ్ ఇంటి గొడవల కారణంగా సోమవారం స్తంభం ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. విద్యుత్ తీగలను పట్టుకుంటానని అనడంతో స్థానికులు సరఫరా నిలిపివేయించారు. ఎంత నచ్చజెప్పినా దిగిరాక తీగలు పట్టుకుని వేలాడారు. ఆ తర్వాత స్తంభం నుంచి జారి కిందపడగా స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సదరు యువకుడిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

పాఠ్యపుస్తకాల సీజ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఏబీవీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆదిలాబాద్ ఎంఈవో జయశీల పాఠశాలలో సోమవారం తనిఖీ చేశారు. పుస్తకాలు నిల్వ ఉన్న గదిని సీజ్ చేశారు. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాంలు, షూలు తదితర వస్తువులను విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ అక్షయ్, అఖిలేష్, సంజయ్, నిలేష్ తదితరులు ఉన్నారు.

మిస్సింగ్ కేసు

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన వివాహిత దండ్ల లక్ష్మి (42) మతిస్థిమితం సరిగా లేక ఈనెల 3 నుంచి కనిపించడం లేదు. ఎక్కడ ఆచూకీ దొరకకపోవడంతో ఆమె భర్త హన్మండ్లు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రవీందర్ తెలిపారు.